
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల జిల్లా వార్తలు

5★★

ఆదివారం 7 జనవరి 2024

ఇంటింటా రాములోరి అక్షింతలు 8లో..

లోపాలున్నాయని తెలిసినా చర్యలేవి 7లో..



గడువు ముగిసే.. అనుసంధానం ఆగె..

- ఏబీపీఎస్ ద్వారా ఈజీఎస్ కూలీలకు డబ్బుల చెల్లింపు
- జాబ్ కార్డులు, ఆధార్ వివరాలు సరిపోక ఆలస్యం

జగిత్యాల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రవేశ పెట్టిన ఆధార్ ఆధా రిత వ్యవస్థ ద్వారా కూలి పొందడానికి జిల్లాలో పలువురు కూలీలు అన ర్హులుగా మిగిలారు. గత నెల 31వ తేదీని ఆధార్ లింకు చేసుకోవడానికి చివరి తేదీగా కేంద్రం ప్రకటించినా కూలీలు పూర్తి స్థాయితో అనుసంధానం చేసుకోలేక పోయారు. ఇక నుంచి కూలీలకు చెల్లింపులు వారు ఏ బ్యాంకుకు ఆధార్ లింకు చేసుకున్నారో ఆ బ్యాంకు ఖాతాకే జమ కానున్నాయి. దీంతో ఏబీపీఎస్‌కు అనుసంధానం కాని వారంతా కూలి డబ్బులు పొందడం ఎలా అనే అయోమయంలో పడ్డారు.

జిల్లాలో ఈజీఎస్ కూలీల సంఖ్య..

జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల్లో 1,51,026 మంది ఉపాధి హామీ కూలీలున్నారు. ఇందులో ఇప్పటివరకు 1,51,003 మంది కూలీల ఆధార్ లింక్ పూర్తయ్యాయి. కూలీల బ్యాంకు ఖాతాకు 1,42,904 మంది లింక్ చేయడం పూర్తయింది. మిగిలిన కూలీలకు ఆధార్ లింక్ చేయడంతో పాటు బ్యాంకు ఖాతాను లింక్ చేయడం పూర్తి కావాల్సి ఉంది. పలువురు కూలీలు విదేశాలకు వెళ్లడం, ఇతర రాష్ట్రాల్లో ఉపాధి కోసం వెల్లడం జాప్యానికి కారణంగా తయారయ్యాయి.

ఏబీపీఎస్ ద్వారా చెల్లింపు...

ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలకు వారు పనిచేసిన కూలి సొమ్మును చెల్లించడానికి కేంద్ర ప్రభుత్వం ఏబీపీఎస్ (ఆధార్ బేస్డ్ పే మెంట్ సిస్టం ఆధార్ ఆధారిత చెల్లింపు వ్యవస్థ)ను ప్రవేశపెట్టింది. దీని ప్రకారం ఉపాధి హామీ సిబ్బంది, క్షేత్రసహాయ కులు కూలీల జాబ్ కార్డుకు ఆధార్ అనుసంధానం చేయాలి. దాన్ని కూలీలు తమకున్న బ్యాంకు ఖాతా లేదా పోస్టల్ బ్యాంకు ఖాతాకు అనుసంధానం (లింకు) చేసుకోవాలి. వివిధ కారణాలతో లింకు కాకపోవడం, లింకు అయినా ఎన్‌పీసీఐలో అధికారికంగా నమోదు కాకపోవడం వంటి కారణాలతో చాలా మంది కూలీలకు ఏబీపీఎస్ ద్వారా కూలీ పొందడానికి అవకాశం కోల్పోవాల్సి వచ్చింది.

ఆధార్ లింక్ ప్రక్రియ ఇలా...

జిల్లాలో జాబ్ కార్డుదారుల ఆధార్‌ను ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు చాలా వరకు అనుసంధానించారు. 90 శాతం ఇలా జాబ్‌కార్డుకు ఆధార్ లింకయ్యాయి. 10 శాతం మంది జాబ్‌కార్డులు అను సంధానం కాలేదు. ఇక్కడ అనుసంధానమైన జాబ్‌కార్డులు, ఆధార్ లింకైన వన్నీ ఎన్‌పీసీఐ (నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)లో ఆమోదం పొందితేనే కూలీల సొమ్ము వారి ఖాతాలో జమవుతాయి. ఇలా అనుసంధానమైనా ఆమోదం లభించనివి సైతం ఉన్నాయి. అంటే వీరంతా వెంటనే తమ ఆధార్‌ను జాబ్ కార్డుతో లింకు చేయించుకుని అనంతరం బ్యాంకు ఖాతాకు అనుసంధానం చేయించు కోవాలి. కూలీలు పోస్టాఫీసు లోని పోస్టల్ లేదా జాతీయ బ్యాంకుకు ఏదైనా తనకు ఇష్టమైన బ్యాంకు ఖాతాకు లింకు చేసుకోవాలి.

గడువు పొడిగిస్తే వంద శాతం పూర్తి చేస్తాం

నరేశ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి



ఉపాధి హామీ కూలీల జాబ్ కార్డులకు ఆధార్ అను సంధానంతో పాటు బ్యాంకు ఖాతాలను సైతం లింక్ చేయడానికి గడువు గత నెలాఖరుతో ముగిసింది. కేంద్ర ప్రభుత్వం గడువు పొడగింపు యోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. గడువును పొడిగిస్తే వంద శాతం లింక్ చేసే పనులను పూర్తి చేస్తాము.

నేడు జగిత్యాలలో

ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీ

- జ్యోతి హైస్కూల్‌లో ఏర్పాట్లు
- ఉదయం 10 గంటలకు ప్రారంభం

జగిత్యాల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు, ఆదివారం జగిత్యాలలోని రాంబ జార్, పురాణిపేటలో గల జ్యోతి హై స్కూల్ వేదికగా, పవర్డ్ బై ఎయిమ్స్ విద్యా సంస్థలు, రియల్ పార్ట్‌నర్స్ స్వర్గసీమ సుకేతన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పోటీలకు మహిళలకు, యువతులు, విద్యార్థినులకు ఆహ్వానం పలుకుతోంది. మహిళల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ప్రతి ఏటా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో ముత్యాల ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఈ ఏడాది కూడా ముగ్గుల పోటీలకు ఏర్పాట్లు చేశారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి ఆరు వేలు, ద్వితీయ బహుమతి నాలుగు వేలు, తృతీయ బహుమతి మూడు వేలు రూపాయలు అందజేస్తారు. పలువురికి కన్సొలేషన్ బహుమతులకు కూడా అందజేయనున్నారు. పోటీల్లో చుక్కల ముగ్గులు మాత్రమే చేతితో వేయాల్సి ఉంటుందని, జల్లెడ మాత్రం వాడవచ్చునని నిర్వాహకులు పేర్కొంటున్నారు. ముగ్గుకు కావాల్సిన రంగులు, పుష్పాలు ఇతరత్రా సామగ్రి పోటీ దారులే తెచ్చుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ముగ్గులో ఎన్ని చుక్కలు, ఎన్ని వరసలో చెప్ప గలగాలి. ముగ్గు వేయడానికి గరిష్ట సమయం రెండు గంటలు. గొబ్బెమ్మలు, బతుకమ్మ వంటివి తప్ప ఇతర వస్తువులు ఎక్కువగా అలంకరించరాదు. ముగ్గు అదనపు అందానికి మాత్రమే వస్తువులు వాడాలి తప్ప ఇతర వస్తువే ప్రధానంగా ఉండకూడదని పేర్కొన్నారు. వివరాలకు, పేర్ల నమోదుకు సెల్ నంబరు 9393551919, 9985411297లలో సంప్రదించవచ్చును.

గడువులోగా సీఎంఆర్ అందించకుంటే చర్యలు

కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

జగిత్యాల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రైస్ మిల్లర్లు నిర్ణీత గడువులోగా సీఎంఆర్ అప్పగించకుంటే చర్యలు తప్పవని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా, సివిల్ సప్లయి టాస్క్‌ఫోర్సు అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఓఎస్‌డీ ప్రభాకర్‌లు అన్నారు. శనివారం పట్టణంలోని కలెక్టరేట్ కార్యాలయంలో సీఎంఆర్ లక్ష్యం సాధించుటపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇటీవల రైస్ మిల్లుల్లో తనిఖీలు చేసిన సందర్భంగా ధాన్యం తక్కువగా ఉన్నట్లుగా గుర్తించి నోటీసులు జారీ చేసిన పలువురు మిల్లర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సీఎంఆర్ డెలివరీపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణను క్షేత్ర స్థాయి సిబ్బంది చేయాలని ఆదేశించారు. సీఎంఆర్ బియ్యం నిల్వలకు అవసరమైన గోదాంలలో స్థలాల ఏర్పాటు, స్టాక్స్ దిగుమతి చేసుకోవడానికి సరిపడు హమాలీలను ముందస్తుగా సమకూర్చుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, జిల్లా సివిల్ సప్లయి అధికారి వెంకటేశ్వర్ రావు, డీఎం హతీరాం, పలువురు సివిల్ సప్లయి అధికారులు, సిబ్బంది, రా రైస్‌మిల్లరు, బాయిల్డ్ రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

గడువులోగా చలాన్లు చెల్లించాలి

ఎస్పీ సన్ ప్రీత్ సింగ్

జగిత్యాల టౌన్, జనవరి 6 : గడువులోగా డిస్కౌంట్ ట్రాఫిక్ చలాన్లు చెల్లించాలని జగిత్యాల జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. పోలీస్ ప్రధాన కార్యాలయంలో శనివారం పోలీస్ అధికారులతో ఎస్పీ ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. ట్రాఫిక్ చలాన్లు పెండింగ్‌లో ఉన్న వాహనదారులకు రాష్ట్ర ప్రభుత్వం భారీ రాయితీ ప్రకటించిందన్నారు. జిల్లాలో 3.4 లక్షల చలాన్లు పెండింగ్‌లో ఉన్నాయని ఈ నెల 10వ తేది లోపు చలాన్లు చెల్లించి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎంపీటీసీల క్యాంపు రాజకీయాలు

స్టే యత్నంలో ఎంపీపీ

ఇబ్రహీంపట్నం, జనవరి 6: ఎలాగైనా ఎంపీపీ పదవి దక్కించుకోవాలనే ఉద్దేశ్యంతో ఓ ఎంపీటీసీ ఇబ్రహీంపట్నం ఎంపీపీ జాజాల భీమేశ్వరిపై అవిశ్వాస తీర్మానం పెట్టి క్యాంపు రాజకీయాలు చేస్తుంటే ప్రస్తుతం ఉన్న ఎంపీపీ జాజాల భీమేశ్వరి పదవిని వదులుకోవద్దనే సంకల్పంతో కోర్టు నుంచి స్టే తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే క్యాంపులో ఉన్న 8 మంది ఎంపీటీసీలను లాగెందుకు బీఆర్ఎస్ నాయకులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. బీఆర్ఎస్ పార్టీని విడవద్దని, క్యాంపు రాజకీయాలు మానేసి వస్తే తమరికే ఎంపీపీ, వైస్ ఎంపీపీ పదవులు ఇస్తామని బీఆర్ఎస్ లీడర్లు ఆఫర్లు ప్రకటించినా క్యాంపులో ఉన్న ఎంపీటీసీలు లొంగడం లేదని తెలుస్తోంది. క్యాంపు నుంచి రాక ముందే ఎంపీపీ భీమేశ్వరి, వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి తక్షణమే రాజీనామా చేయాలని క్యాంపులో ఉన్న ఎంపీటీసీలు డిమాండ్ చేసినట్లు సమాచారం. విశ్వ ప్రయత్నాలు చేసినా ఎంపీటీసీలు లొంగకపోవడంతో అమెరికాలో ఉన్న ఎంపీపీ దంపతులు హుటాహుటిన రెండు రోజుల క్రితం స్వదేశం తిరిగివచ్చి కోర్టు నుంచి స్టే తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. అధికారులు ఈ నెల 16న అవిశ్వాసంపై సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీటీసీలకు నోటీసులు అందించారు. మండలంలో ఎంపీపీపై అవిశ్వాసం రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది.

ఇంటింటికీ అయోధ్య రామయ్య అక్షింతలు

జగిత్యాల టౌన్, జనవరి 6 :ఇంటింటికి ఆయోధ్య రామయ్య అక్షింతలు అందజేసే కార్యక్రమాన్ని భక్తులు శనివారం జిల్లా కేంద్రంలో కన్నుల పండువగా నిర్వహించారు. జిల్లా కేంద్రం లోని అష్టలక్ష్మి ఆలయం నుంచి సత్యసాయి ఆలయం వరకు శ్రీ రామ భక్తులు అయోధ్య నుంచి వచ్చిన అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని డప్పు, చప్పుళ్ల మధ్య, మహిళలు కోలాటాలు వేస్తూ అందజేశారు. భక్తులు మంగళహారతితో స్వాగతం పలికి అక్షింతలు అందుకున్నారు. శ్రీరామ భక్తులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

రాయికల్, జనవరి 6: రాయికల్ మండలంలో పలువురు బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే సంజయ్ కుమార్ శనివారం పరామర్శించారు. మండలంలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ కాటిపెల్లి గంగారెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ నారాయణరెడ్డి తల్లి అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబసభ్యులను, గ్రామ ఉప సర్పంచ్ కడార్ల శేఖర్ వదిన మరణించగా వారి కుటుంబసభ్యులను, మండలంలోని మైతాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త ఇక్రమొద్దీన్ ఇటీవల మరణించగా వారి కుటుంబసభ్యులను పరామర్శించి పార్టీపరంగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఉప్పుమడుగు గ్రామానికి చెందిన కోనమల్ల గంగారాం భార్య గుండెపోటుతో మరణించగా వారి కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, మండల పార్టీ అధ్యక్షుడు కోల శ్రీనివాస్, సర్పంచులు అజారొద్దీన్, ముత్తన్న, ఉప సర్పంచ్ తిరుపతి రావు, మాజీ ఏఎంసీ చైర్మన్ గన్నె రాజరెడ్డి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి తలారి రాజేష్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, గ్రామ శాఖ అధ్యక్షుడు అమర్, నాయకులు సుధాకర్, భిక్షపతి, బాబా, సురేందర్ నాయక్ పాల్గొన్నారు.

ప్రజల సందేహాలను నివృత్తి చేయాలి

- అభయహస్తం ఆందోళనలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి
- జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ దావ వసంతసురేష్

జగిత్యాల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ప్రజాపాలన దరఖాస్తుల ప్రక్రియలో ప్రజల సందేహాలను నివృత్తి చేయాలని, అభయహస్తం పథకంలో ఆందోళనలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతసురేష్ అన్నారు. శనివారం జగిత్యాల జిల్లా పరిషత్ కార్యాలయంలో జడ్పీచైర్‌పర్సన్ అధ్యక్షతన ఎంపీడీవోలతో పలు అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజాపాలనలో ప్రజలకు ఉన్న సందేహాలు సమస్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వసంత మాట్లాడుతూ పదేళ్లుగా గత ప్రభుత్వ ఆదేశాలతో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అందించడంలో చేసిన సమష్టి కృషి జిల్లాకు నంబర్‌వన్ స్థానం దక్కేలా చేసిందన్నారు. ప్రజాపాలన పథకం ఉద్దేశ్యం మంచిదే అయినప్పటికీ క్షేత్రస్థాయిలో ప్రజల్లో కొంత ఆందోలన నెలకొందన్నారు. అప్లికేషన్ ఫారంలో ఖాతా నంబర్ లేకపోవడంతో లబ్ది దాళారుల చేతిల్లోకి వెళ్లే ప్రమాదం ఉందన్నారు. అలాగే రేషన్‌కార్డు లేనివారికి దరఖాస్తు ఫారంలో నెంబర్ నమోదుచేసే అవకాశంలేదని, ఈఅంశాలపై ప్రభుత్వం నుంచి స్పష్టత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో లోకల్‌బాడీస్ అదనపుకలెక్టర్ దివాకరస్, జడ్పీసీఈవో రఘువరణ్, డీపీవో దేవరాజు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీచైర్‌పర్సన్ వసంతసురేష్



మెట్‌పల్లిలోని పాతబస్టాండ్‌లో భిక్షాటన చేస్తున్న ఆటో డ్రైవర్లు

భిక్షాటనతో ఆటో డ్రైవర్ల నిరసన

మెట్‌పల్లి, జనవరి, 6 : కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో ఆటో డ్రైవర్ల బతులు వీధిపాలయ్యాయని ఆవేదన వ్యక్తం చేస్తూ మెట్‌పల్లి పట్టణంలో తెలంగాణ డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు భిక్షాటన చేశారు. శనివారం పట్టణంలో పలు వీధుల్లో భిక్షాటన చేస్తూ రెవెన్యూ కార్యాలయం ముందు నిరసన తెలిపి తహసీల్దార్ శేఖర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటో నడుపుతూ బతుకుతున్న తమ జీవితాలు వీధి పాలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించడానికి తగు చర్యలు చేపట్టాలని కోరారు. ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలు ఆటో ప్రయాణించడం లేదని దీంతో రోజువారి బతుకు దీనస్థాయికి దిగజారుతుందని సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం ద్వారా తెలియజేసినట్లు పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు గుగ్లావత్ శివలాల్, రంగు సంపత్‌గౌడ్, యామగణేస్, రామయ్య, గంగాధర్, శంకర్, గట్టయ్య, నవాబ్, నర్సయ్య, రవి, సంతోష్, రాజు, వసంత్ కుమార్, పాషా, షఫీ, లక్ష్మణ్, నరేందర్, ఐలయ్య, బుచ్చయ్య, యూనియన్ సభ్యులు, ఉన్నారు.

యూనివర్సిటీ భూములు కబ్జా చేస్తే ఊరుకోం

● ఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ సంకశాల మల్లేష్



ఫార్మసీ కళాశాల భూములను పరిశీలిస్తున్న వీసీ, ఎస్‌యూ సిబ్బంది

గణేశ్‌నగర్, జనవరి 6: శాతవాహన యూనివర్సిటీ కళాశాల భూములను కబ్జా చేసే ప్రయత్నం చేస్తే ఊరుకునేది లేదని శాతవాహన విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎస్. మల్లేష్ హెచ్చరించారు. రెండు రోజుల నుంచి శాతవాహన యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల భూములను కళాశాల పక్కనే ఉన్న ప్రైవేట్ భూములతో పాటు ఎలాంటి అనుమతులు లేకుండా చదును చేసే ప్రయత్నం చేయగా వెంటనే దృష్టికి వచ్చిందన్నారు. వెంటనే సంబంధిత పోలీసు అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకొని భూ కబ్జాకు పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకొని వాహనాలను సీజ్ చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపారు. ఫార్మసీ కళాశాల భూములను ఇకపైన ఎవరూ కబ్జా చేయకుండా పూర్తి స్థాయి ఫెన్సింగ్ చేస్తున్నామని తెలిపారు. ఎవరైనా భూములను కబ్జా చేసే ప్రయత్నం చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. వారిపై క్రిమినల్ కేసులు వేస్తామన్నారు.

భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

● ఫార్మసీ కళాశాల ఎదుట ఏబీవీపీ ధర్నా

గణేశ్‌నగర్,జనవరి 6: ఎస్‌యూ భూమిపై కన్నేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శాతవాహన యూనివర్సిటీ ఎదుట శనివారం ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ పుసాల విష్ణు మాట్లాడుతూ శాతవాహన విశ్వవిద్యాలయం ఎల్ఎండీ ఫార్మసీ కళాశాల భూమిని చదును చేసిన విషయంలో విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు రిజిస్ట్రార్ వరప్రసాద్, ఉపకులపతి మల్లేష్ లేదా డ్రాయింగ్ ఆఫీసర్ సైన్స్ కాలేజి ప్రిన్సిపల్ డాక్టర్ జయంతితో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాల్సి ఉన్నా వారు ఒక కాంట్రాక్ట్ అధ్యాపకుడితో ఫిర్యాదు చేయించడం, బాధ్యుడిగా చేసే ప్రయత్నం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. గత ప్రభుత్వ అండదండలతో ఉపకులపతి, ఆయన అనుకూల వర్గం ఏం చేసినా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఈ ప్రభుత్వం అయినా శాతవాహన విశ్వవిద్యాలయ అధికారుల అవినీతి, అక్రమాలపై విచారణ చేపట్టి, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్య నిర్వహణ సమితి సభ్యుడు అంజన్న, నగర కార్యదర్శి నందు, రాష్ట్ర కార్య వర్గ సభ్యులు మధు, లాఫోరం కన్వీనర్ ప్రమోద్, శ్రీ వర్ధన్, సాయి, రాజశేఖర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా కో-ఆర్డినేటర్‌గా నాగేందర్‌సింగ్

కరీంనగర్ టౌన్, జనవరి 6: తెలంగాణ ఉద్యోగుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కో-ఆర్డినేటర్‌గా సర్దార్ నాగేందర్‌సింగ్‌ను నియమించినట్లు ఉమ్మడి జిల్లా చైర్మన్ జక్కోజు వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ ఫయాజ్ అలీలు ప్రకటించారు. ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించిన వారికి నాగేంద్‌సింగ్ కృతజ్ఞతలు తెలిపారు. సంఘం బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య

కోరుట్ల రూరల్, జనవరి 6 : కోరుట్ల మున్సిపల్ పరిధిలోని ఎఖీన్‌పూర్ గ్రామంలో ఆనారోగ్యం కారణంతో ఒల్లెం మల్లు (78) అనే వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు శనివారం తెలిపారు. మల్లు గత కొన్ని రోజుల నుంచి కడుపునొప్పి, నరాల బలహీనతో బాధపడుతూ పలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్నా నయం కాలేదు. దీంతో వ్యాధి గురించి తరచుగా బాధపడుతుండేదని పోలీసులు, బంధువులు తెలిపారు. మల్లు శుక్రవారం రాత్రి ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో తాను పడుకున్న మంచంతో పాటు దుప్పటికి నిప్పు అంటిచుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. మల్లు కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు గమనించి కాపాడే ప్రయత్నం చేశారని తెలిపారు. గ్రామస్థుల సహకారంతో చికిత్స నిమిత్తం కోరుట్ల ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మల్లు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మల్లు కుమారుడు మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిరణ్ తెలిపారు.

గుండెపోటుతో పొలంలోనే రైతు మృతి

శంకరపట్నం, జనవరి 6: మండలంలోని రాజాపూర్ గ్రామంలో శుక్రవారం గుండెపోటుతో రైతు పొలంలోనే మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మాతంగి ఓదెలు (55) అనే రైతు పొలంలో పనిచేస్తుండగా గుండెపోటు రావడంతో పొలంలోనే కుప్పకూలిపోయాడు. ఓదెలు ఎంతసేపటికీ ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు వెతకగా పొలంలో పడిపోయి మృతి చెందినట్లు తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

కొడిమ్యాల, జనవరి 6: మండలంలోని తురుకకాశీనగర్ గ్రామ శివారులో శనివారం సాయంత్రం గంగాధరకు చెందిన పలువురు పేకాట రాయుళ్లను పట్టుకొని వారి వద్ద నుంచి 16వేల 300 రూపాయల నగదును పట్టుకున్నట్లు ఎస్సై కె. వెంకట్‌రావు తెలిపారు. 10 మోటార్‌సైకిళ్లు, 12 మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. పేకాట ఆడుతున్న వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు

వేములవాడ టౌన్, జనవరి 6: వన్యప్రాణులను వేటాడేందుకు విద్యుత్ తీగలు అమర్చడంతో అమాయకుల ప్రాణాలు పోతున్నాయని, వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తప్పవని వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి శనివారం ఒక ప్రకటన ద్వారా వేటగాళ్లను హెచ్చరించారు. కోనరావుపేట మండలం మర్రిమడ్ల, రుద్రంగి మండలం మానాల గ్రామాల్లో ఇటీవల వన్యప్రాణులను వేటాడేందుకు విద్యుత్ తీగలు అమర్చడంతో ఇద్దరు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. ఇద్దరు అమాయకులు మరణానికి కారణమైన వారిపై కేసు నమోదు చేసి పీడీ యాక్టు పెట్టి జైలుకు పంపించామని తెలిపారు. పంట పొలాలను కాపాడేందుకు రైతులు, వన్యప్రాణులను వేటాడేందుకు వేటగాళ్లు విద్యుత్ తీగలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు.

రామడుగు ఎంపీపీ అవిశ్వాసంపై హైకోర్టు స్టే

రామడుగు, జనవరి 6: రామడుగు మండల పరిషత్ అధ్యక్షురాలు కలిగేటి కవితపై ఈ నెల 17న ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం స్టే విధించింది. ఎంపీపీపై అవిశ్వాస తీర్మానానికి కాంగ్రెస్ ఎంపీటీసీ జవ్వాజి హరీష్ ఆధ్వర్యంలో పదిమంది సభ్యులతో కలిసి గత నెల 19న ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు. దీంతో ఆయన ఈ నెల 8న అవిశ్వాస తీర్మానానికి ప్రత్యేక సమావేశం నిర్వహించుటకు నోటీస్ జారీ చేశారు. అయితే ఎంపీపీ దీన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో రిట్ వేయడంతో 8న నిర్వహించనున్న అవిశ్వాస తీర్మానం ఆపాలని స్టే విధించింది. దీంతో అవిశ్వాస తీర్మానానికి బ్రేక్ పడింది. ఎంపీపీ, జడ్పీటీసీ, ఆర్డీవోకు హైకోర్టు స్టేను సమర్పించినట్లు విలేకరులతో ఎంపీపీ తెలిపారు.

పోక్సో బాధితులకు సహాయం అందించాలి

తిమ్మాపూర్, జనవరి6: పోక్సో బాధితులను గుర్తించి కావలసిన సహాయం అందించాలని మహాత్మానగర్ సర్పంచ్ జక్కని శ్రీవాణి తెలిపారు. శనివారం మండలంలోని మహాత్మానగర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గ్రామ బాలల పరిరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాల్గొని మాట్లాడారు. గ్రామంలో భిక్షాటన చేసే పిల్లలను గుర్తించాలన్నారు. బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలన్నారు. బాల కార్మికులు లేకుండా చూడాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆ దిశగా పాటు పడాలన్నారు. గ్రామల్లో బాల్య వివాహాలను నిరోధించడంలో గ్రామ పంచాయతీ పాలకులు ఆయా శాఖల అధికారులు కీలకపాత్ర పోషించాలన్నారు. ఉత్తమ గ్రామంగా తీర్చిదిద్దాలని చట్టబద్ధమైన దత్తతను గుర్తించి ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని కోరారు. పిల్లల హక్కులను కాపాడేలా అధికారులు గ్రామాల్లోని ప్రజా ప్రతినిధులకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీడిపివో ఆరవింద, సూపర్‌వైజర్ శ్రీలత, అంగన్వాడీ టీచర్లు కవిత, పద్మ, ఇతర ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఎస్‌యూ డిగ్రీ పరీక్షల్లో 12 మంది విద్యార్థులు డీబార్

గణేశ్‌నగర్, జనవరి 6: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ ఒకటి, మూడో సెమిస్టర్ పరీక్షల్లో 12 మంది విద్యార్థులు డీబార్ అయినట్లు ఎస్‌యూ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటో సెమిస్టర్‌లో ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాల హుజురాబాద్‌లో- 2, అల్ఫోర్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల కరీంనగర్‌లో-1, సెమిస్టర్-3లో ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల హుజురాబాద్‌లో-1 అపూర్వ ఉమెన్స్ డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో ఏడుగురు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల గోదావరిఖనిలో ఒకరు డీబార్ అయినట్లు తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఏడుగురికి జైలుశిక్ష

కరీంనగర్ క్రైం, జనవరి 6: మోతాదుకు మించి మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన కేసుల్లో ఒకరికి పది రోజులు, మరొకరికి ఐదు రోజులు, మరో ఐదుగురికి మూడు రోజుల జైలుశిక్ష విధిస్తూ కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ట్రాఫిక్ ఏసీపీ మహ్మద్ సర్వర్ తెలిపారు. ఇటీవల డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డ 45మంది వాహనదారులను శనివారం కోర్టులో హాజరుపర్చగా ఏడుగురికి జైలుశిక్షతో పాటు 14,500 జరిమానా విధించారని తెలిపారు. మిగతా 38 మంది వాహనదారులకు 66 వేల రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు.

ప్రజాపాలన కార్యక్రమానికి అద్భుత స్పందన

- నాలుగు నెలలకు ఒకసారి ప్రజాపాలన నిర్వహణ - ఉమ్మడి జిల్లా నోడల్ అధికారి శ్రీదేవసేన



లాలపల్లిలో మాట్లాడుతున్న శ్రీదేవసేన

ఎలిగేడు, జనవరి 6: కాంగ్రెస్ ప్రభుత్వ గ్యారంటీ పథకాలను అర్హులందరికీ అమలు చేసేందుకు ప్రజలనుంచి దరఖాస్తుల స్వీకరణ కోసం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమానికి అద్భుత స్పందన వచ్చిందని ప్రజాపాలన ఉమ్మడి జిల్లా నోడల్ అధికారి శ్రీదేవసేన అన్నారు. శనివారం మండలంలోని లాలపల్లి, నారాయణపల్లి గ్రామాల్లో చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమానికి విచ్చేసిన ప్రజాపాలన ఉమ్మడి జిల్లా కరీంనగర్ నోడల్ అధికారి శ్రీదేవసేనను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె అరుణశ్రీ ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రజాపాలన కార్యక్రమానికి దరఖాస్తులు సమర్పించేందుకు వచ్చిన దరఖాస్తుదారులతో శ్రీదేవసేన ముచ్చటించారు. అనంతరం ఆమె లాలపల్లిలో మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలించేందుకు పెద్దపల్లి జిల్లాకు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. పెద్దపల్లి కలెక్టర్‌గా రెండున్నర సంవత్సరాల పాటు తాను పనిచేయడం తన కెరియర్‌లో ఒకమైలురాయిగా నిలిచిపోతుందన్నారు. గ్యారంటీ పథకాలపై మంచి అవగాహనతో ప్రజలు వారికి అవసరమైన పథకాలకు దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. నాలుగునెలలకు ఒకసారి ప్రజాపాలన కార్యక్రమం చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. ప్రజాపాలన కార్యక్రమానికి వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదుచేసి, నిర్ధిష్ట ప్రభుత్వ మార్గదర్శకాలు ప్రకారం అర్హులను ఎంపికచేసి పథకాలను అమలుచేస్తామని ఆమె పేర్కొన్నారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ ప్రజలకు పథకాలను అందించేందుకు ప్రభుత్వ యంత్రాంగమే గ్రామాల్లో ప్రజల వద్దకు వచ్చి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని అన్నారు. నూతన రేషన్‌కార్డుల కోసం సైతం ప్రజాపాలన కార్యక్రమంలో తెల్లకాగితంపై దరఖాస్తు సమర్పించాలని, రేషన్‌కార్డు దరఖాస్తులు, ఇతర దరఖాస్తుల సమర్పణ కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీధర్, జిల్లా ఉపాధి అధికారి వై తిరుపతిరావు, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, సింగిల్‌విండో ఛైర్మన్ గోపు విజయభాస్కర్‌రెడ్డి, సర్పంచ్ సింగిరెడ్డి ఎల్లవ్వ, ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, తహసీల్దార్ స్వర్ణ, ఎంపీవో అనిల్‌రెడ్డి, ఏపీఎం సుధాకర్, పంచాయతీ కార్యదర్శి ఎన్ శిరీష, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఏఐఏఎస్‌ఏ జాతీయ అధ్యక్షుడిగా దమ్మన్నపేట విద్యార్థి


రామ్ విలాస్

గంభీరావుపేట, జనవరి 6: ఆల్ ఇండియా అగ్రికల్చరల్ స్టూడెంట్ అసోసియేషన్ (ఏఐఏఎస్‌ఏ) జాతీయ అధ్యక్షుడిగా గంభీరావుపేట మండలం దమ్మన్నపేటకు చెందిన రామ్ విలాస్ పాశ్వన్ ఎన్నికయ్యాడు. ఆల్ ఇండియా అగ్రికల్చర్ స్టూడెంట్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడిగా రామ్‌విలాస్‌ను ఇటీవల వెల్లడించిన ఫలితాల్లో ప్రకటించారు. దమ్మన్నపేటకు చెందిన విస్లావత్ లోక్యా నాయక్, సత్తవ్వ దంపతుల కుమారుడు రామ్‌విలాస్ పాశ్వన్. ఇతను ఐసీఏఆర్ భారత వ్యవసాయ పరిశోదన విద్యాయలంలో (న్యూఢిల్లీ)లో పరిశోధనలను కొనసాగిస్తున్నాడు. ఇటీవల నిర్వహించిన ఎన్నికలకు సంబంధించి అన్ని రాష్ట్రాల విద్యార్థుల నామినేషన్‌కి రిటర్నింగ్ అధికారులు దరఖాస్తులను ఆహ్వానించారు. దీనికి గాను అన్ని రాష్ట్రాల నుంచి 304 మంది నామినేషన్‌లు వేశారు. వారి యొక్క కార్యకలాపాలను, ఆలోచన లు పరిగణలోకి తీసుకుని నామినేషన్ రిటర్నింగ్ అధికారులు మంచి ప్రతిభ కనబర్చిన రాంవిలాస్‌ను అధ్యక్షుడిగా ప్రకటించారు. మారుమూల గ్రామానికి చెందిన గిరిజన బిడ్డ ఎంపిక కావడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

గంజాయి రవాణాదారులపై టాస్క్‌ఫోర్స్ స్పెషల్‌డ్రైవ్

- ఆరుగురి బైండోవర్

కోల్‌సిటీ, జనవరి 6: గంజాయి నిర్మూలించాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం రామగుండం కమిషనరేట్‌లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. గోదావరిఖని వన్‌టౌన్, మంచిర్యాల, బెల్లంపల్లి వన్‌టౌన్, చెన్నూర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి వేల్పుల సాయిచందర్, ఎస్‌కే జమీర్, జాడి సాయిపవన్, ఎండీ అన్వర్, గుజ్జుల సాయితేజ, భీముల అంజిని బైండోవర్ చేశారు. బైండోవర్లనుఉల్లంఘిస్తే జైలుశిక్ష తప్పదని సీపీ హెచ్చరించారు.

'కాళేశ్వరం'లో లోపాలున్నాయని తెలిసినా చర్యలేవి?

- ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి


ప్రజాపాలన దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

రాయికల్, జనవరి 6: కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో లోపాలు ఉన్నాయని నాలుగేళ్లుగా బీజేపీ నాయకులు చెబుతున్నారని, మరి ఎందుకు చర్యలు చేపట్టలేదని ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. రాయికల్ పట్టణంలోని 4వ వార్డులో నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని శనివారం ఆయన సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వాస్తవాలను వెలికితీయాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయవిచారణకు ఆదేశిస్తే బీజేపీ నాయకులు సీబీఐ ఎంక్వైరీ కోరడం హాస్యాస్పదమన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌ను లొంగదీసుకోవడానికే బీజేపీ నాయకులు కాళేశ్వరం అవకతవకలపై సీబీఐ విచారణ కోరుతున్నారని జీవన్‌రెడ్డి అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో నాణ్యత లోపించి బ్యారేజీ కుంగిపోవడం, కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు పూర్తిస్థాయిలో సీడబ్ల్యూసీ అనుమతులు లేవని బీఆర్‌ఎస్‌వాళ్లే చెప్పారని అన్నారు. ప్రాజెక్ట్ అనుమతులు పరిశీలించి నిధులు ఇవ్వాల్సి ఉండగా, పూర్తి స్థాయిలో అనుమతులు లేని ప్రాజెక్ట్‌కు నిధులు ఏ విధంగా సమకూర్చారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ పారదర్శకతతో వాస్తవాలను వెలికితీయాలనే భావనతో, న్యాయ విచారణకు ఆదేశిస్తున్న తరుణంలో బీజేపీ నాయకులు కాళేశ్వరంపై సీబీఐ విచారణ ఎందుకు చేపట్టడం లేదనడం ఆశ్చర్యం కలుగుతుందన్నారు. ప్రాణహిత తుమ్మడిహెట్టి వద్ద మహారాష్ట్ర ప్రభుత్వంతో గతంలోనే ఒప్పందం కుదిరిందని, కేవలం రూ.10 వేల కోట్లతో తుమ్మడిహెట్టి వద్ద నుంచి ప్రాణహిత ప్రవాహాన్ని మళ్లించి సుందిళ్లకు కలుపవచ్చని అన్నారు. ఒకే లిఫ్ట్ ద్వారా ఎల్లంపల్లికి నీరు ఎత్తిపోయవచ్చని, రెండు లిఫ్ట్‌ల భారం తగ్గిపోతుందని అన్నారు. తక్షణమే తుమ్మడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణం చేపట్టేందుకు వచ్చే మార్చి బడ్జెట్‌లో ప్రతిపాదించి, సంవత్సర కాలంలో నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నిబద్ధతతో కొనసాగే పార్టీ అని, జాతీయ స్థాయిలో అమలు చేస్తున్న జాతీయ ఉపాధి హామీ చట్టం, విద్యా హక్కు చట్టం, సమాచార హక్కు చట్టం, నిరుపేద వర్గాలకు ఇళ్ల నిర్మాణం అమలు చేస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన కార్యక్రమాలను ఏ రాజకీయ పార్టీ కొత్తగా ఏ కార్యక్రమాలు చేపట్టలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

మెట్‌పల్లి, జనవరి 6: మెట్‌పల్లిలో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని శనివారం పట్టుకున్నట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మెట్‌పల్లి అనుబంధ గ్రామమైన వెంకట్రావుపేట గ్రామ శివారులో మల్లన్న టెంపుల్ వద్ద ఎస్‌ఐ చిరంజీవి వాహనాల తనిఖీ చేపట్టగా ద్విచక్రవాహనాలపై అనుమానాస్పదంగా కనిపించిన యువకులను తనిఖీ చేయగా వారి వద్ద నుంచి 550 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వారిని విచారించగా నిర్మల్ జిల్లా నుంచి మెట్‌పల్లికి టీఎస్ 21ఎల్1369 నెంబరు గల ద్విచక్రవాహనంపై గంజాయిని తీసుకొస్తున్నట్లు తెలిపారు. వారిని అదుపులోకి తీసుకొని గంజాయి, ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకొని రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. తహసీల్దార్ శేఖర్, వీఆర్‌ఏ సమక్షంలో పంచనామా చేసి ఇరువురుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. గంజాయి పట్టుకున్న ఎస్‌ఐ చిరంజీవి, ఏఎస్‌ఐ ప్రకాశ్, సిబ్బంది జలెందర్, సునీల్, మల్లేశ్‌లను సీఐ అభినందించారు.

సౌదీ అరేబియాలో దమ్మన్నపేట వాసి మృతి


రాజన్న (ఫైల్)

ధర్మపురి, జనవరి 6: మండలంలోని దమ్మన్నపేట గ్రామానికి చెందిన పులిశెట్టి రాజన్న (50) అనే వ్యక్తి సౌదీ అరేబియాలో అనారోగ్యంతో మృతి చెందాడు. జీవనోపాధి నిమిత్తం రాజన్న 11 ఏళ్ల క్రితం సౌదీ అరేబియా దేశానికి వెళ్లాడు. రెండేళ్లకు ఒకసారి ఇంటికి వచ్చి తిరిగి వెళుతున్నాడు. ఏడాది క్రితం కూడా ఇంటికి వచ్చి తిరిగి అక్కడికి వెళ్లాడు. రాజన్న పనిచేస్తుండగా రెండు నెలల క్రితం వాతం వచ్చినట్లు కుటుంబసభ్యులకు సమాచారం అందింది. ఆరోగ్య పరిస్థితి క్షీణించడం వల్ల అక్కడే ఆసుపత్రికి తీసుక వెళ్లారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాజన్న పరిస్థితి విషమించి ఈ నెల 4న మృతి చెందాడు. మృతుడు రాజన్నకు రావాల్సిన 11 ఏళ్ల ఇన్సూరెన్స్ లీగల్ డబ్బులు ఇప్పించాలని, మృతదేహాన్ని దమ్మన్నపేట స్వగ్రామానికి పంపించాలని టీపీసీసీ ఎన్‌ఆర్‌ఐ సెల్ కన్వీనర్ షేక్ చాంద్‌పాషా కోరుతున్నారు.

రాజన్నను దర్శించుకున్న ప్రభుత్వ విప్



లక్ష్మణ్‌కుమార్‌కు రాజన్న ప్రసాదం అందజేస్తున్న ఆలయ అధికారి

వేములవాడ టౌన్, జనవరి 6: వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారిని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శనివారం దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు ఆలయాధికారుల స్వాగతం పలికారు. స్వామివారి ప్రత్యేక పూజలో పాల్గొన్న అనంతరం శ్రీనాగిరెడ్డి మండపంలో ఆలయ అర్చకులు ఆశీర్వచనంగా గావించగా సూపరింటెండెంట్ అల్లి శంకర్ రాజన్న కండువా కప్పి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

జగిత్యాల టౌన్, జనవరి 6 :అనారోగ్య కారణంతో ఓ వివహిత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జిల్లా కేంద్రంలోని హనుమాన్ వాడలో శనివారం చోటు చేసుకుంది. పట్టణంలోని తులసీ నగర్‌కు చెందిన బోగ సౌమ్య(36) అనే మహిళ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. తీవ్ర మనోవేదనకు గురైన సౌమ్య శనివారం తన తల్లిగారి ఇంటి వద్దకు వచ్చి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ సీఐ నటేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ముగ్గురిపై చీటింగ్ కేసు

సిరిసిల్ల క్రైం, జనవరి 6: గత ఎన్నికల్లో తనను మోసం చేశారని సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన మిట్టపల్లి శ్రీకాంత్ అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదుచేసి ధర్యాప్తుచేస్తున్నట్లు టౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు. గత ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థి లగిశెట్టి శ్రీనివాస్, గుంటుక మహేశ్; ఏలూరి రవి తనకు రూ. 1లక్ష ఇస్తానని చెప్పి ప్రచారం చేసేందుకు 15రోజుల్లో తిప్పుకున్నారని, ఆ తర్వాత డబ్బులు ఇవ్వకుండా మోసంచేశారని ఫిర్యాదు చేశాడు. దీంతో ముగ్గురిపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

ఐదుగురిపై అదనపు వరకట్నం కేసు

సిరిసిల్ల క్రైం, జనవరి 6: తనను అదనపు వరకట్నం తీసుకురావాలని తన భర్త, అత్త, మామలు తరుచూ వేధించారని సిరిసిల్ల పట్టణంలోని గాజుల నవ్య అనే మహిళ ఫిర్యాదు మేరకు ఐదుగురిపై అదనపు వరకట్నం కింద శనివారం కేసు నమోదు చేసి ధర్యాప్తుచేస్తున్నట్లు టౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు. తన భర్త గాజుల మల్లేశం, అత్త, మామ, ఆడబిడ్డలు వివాహమైనప్పటి నుంచి తనను వేధించి అదనంగా రెండు లక్షల రూపాయలు కట్నం తీసుకురావాలని చిత్రహింసలకు గురిచేశారని బాధితురాలు నవ్య ఫిర్యాదు మేరకు అయిదుగురిపై కేసు నమోదుచేశామని ఆయన తెలిపారు.

చంపుతామని బెదిరించిన ఇద్దరిపై..

సిరిసిల్ల క్రైం, జనవరి 6: సిరిసిల్ల పట్టణంలోని సంజీవయ్యనగర్‌కు చెందిన రాకం బానుచందర్, రాకం మనోహర్ తనకు ఇచ్చే ఎనిమిది లక్షల రూపాయలు తిరిగి ఇవ్వమని అడిగినందుకు చంపుతామని బెదిరించారని బాధితుడు రాగుల రాములు ఫిర్యాదుపై శనివారం ఇద్దరిపై కేసు నమోదుచేసి ధర్యాప్తుచేస్తున్నామని టౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

సుల్తానాబాద్, జనవరి 6: ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్య యత్నంకు పాల్పడ్డాడు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉందని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. సుల్తానాబాద్ పట్టణంలోని గడీమహల్ కు చెందిన రహీల్ అనే యువకుడు ఒక సెల్ షాప్‌ను నిర్వహిస్తున్నాడు. ఏడాది క్రితమే వివాహం జరిగింది. బార్య ప్రస్తుతం గర్బవతి. షాపు నిర్వహణలో పలువరి వద్ద అప్పులు చేశాడని దానికి తోడు మైక్రో ఫైనాన్స్ సంస్థల వద్ద రుణాలు తీసుకున్నాడని అప్పుల వాళ్ల వేదింపులు, మరో వైపు మైక్రో సంస్థల ప్రతినిదులు వేదింపులు భరించలేక శుక్రవారం రాత్రి ఎవరికీ చెప్పకుండా నీరుకుళ్ల మానేరు బ్రిడ్జి వద్దకు వెళ్లి గడ్డిమందు సేవించాడు. అతని అచూకీ గంట తర్వాత కనుగొన్న కటుంబ సభ్యులు ఉటాహుటిన అసత్రికి తరలించారు. అనంతరం కరీంనగర్ అటు నుంచి హైదరాబాద్ తరలించారు. ప్రస్తుతం బాదితులు అస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

పిచ్చికుక్కదాడిలో ముగ్గురికి గాయాలు

కాల్వశ్రీరాంపూర్, జనవరి 6: మండలంలోని మొట్లపల్లి గ్రామంలో శనివారం పిచ్చి కుక్క కరిసి ముగ్గురికి గాయాలయ్యాయి. గ్రామంలోని దారి వెంట వెళుతున్న పోగుల కౌశిక్, దుర్గం రాఘవ, బోలమల్ల శివలపై పిచ్చికుక్క వెంటపడి దాడి చేసింది. దీంతో వారిని కాల్వ శ్రీరాంపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మండలంలోని పలు గ్రామాల్లో పిచ్చి కుక్కలు ఎక్కువయ్యాయని, కొన్ని వీధి కుక్కలు రోగాల భారిన పడి సంచరిస్తున్నాయని, ఈ విషయంపై ప్రభుత్వం స్పందించి పిచ్చి కుక్కల బెడదను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

వరద కాలువకు నీటి విడుదల


రాంపూర్ పంప్‌హౌజ్ వద్ద ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, తదితరులు

మల్యాల, జనవరి 6: వరదకాలువ కింద సాగు చేస్తున్న రైతులను ఆదుకోవడానికి ఎస్సారెస్పీ నుంచి రెండువేల క్యూసెక్కుల నీటిని కాలువకు విడుదల చేయగా రాంపూర్ పంప్‌హౌజ్ వద్ద చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దిగువకు విడుదల చేశారు. యాసంగి సాగు చేసిన రైతులు కాలువలో నీరులేక ఆందోళన చెందుతుండగా రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే ఇరిగేషన్ సీఈతో మాట్లాడి ఎస్సారెస్పీ నుంచి వరదకాలువకు నీటిని విడుదల చేయాలని కోరారు. దీంతో శనివారం నీరు విడుదల అయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులను ఆదుకునే బాధ్యత తమదేనని ప్రతిపక్ష నేతలు మొసలి కన్నీరు కారవడం విడ్డూరంగా ఉందని అన్నారు. యాసంగిలో గుంట పంట ఎండిపోకుండా చూస్తామని తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళనలు చెయకుండానే ముందస్తుగానే తామే నీటి విడుదల చేశామని అన్నారు. ఎమ్మెల్యే వెంట ఇరిగేషన్ డీఈ తిరుపతి, కాంగ్రెస్ నాయకులు దారం ఆదిరెడ్డి, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, ముత్యం శంకర్, సతీష్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, వీరబత్తిని ప్రసాద్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలు

ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆదిశ్రీనివాస్



పోరుమల్ల గ్రామంలో ర్యాలీగా వస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

మేడిపల్లి, జనవరి 6: గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలని గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతాయని వేములవాడ శాసన సభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని వల్లపల్లిలో మహిళ సమైఖ్య భవనము, పోరుమల్లలో గ్రామ పంచాయతీ భవనం, శుద్ధి జలకేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు సంక్షేమ పథకాల అమలుతో ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉంటాయన్నారు. మహిళలు అందరూ ఒకే చోట సమావేశం అయ్యేందుకు వీలుగా మహిళా సమైఖ్య భవనాలు ఉపయోగపడుతాయని అన్నారు. ఎన్నికల వేల ప్రజలకు ఇచ్చిన హామీలను త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అవినీతిపై మాట్లాడుతూ నిరుద్యోగులు ఉద్యోగాలు లేక అల్లాడుతుంటే మాజీ ఎంపీ వినోద్‌కుమార్ అన్న కూతురు సరితరావుకు ఎగ్జామ్ రాయకుండానే ఏఈ ఉద్యోగం ఇచ్చారన్నారు. తొంబర్రావుపేట, పోరుమల్ల, వల్లంపెల్లిలో ప్రజలు ఆది శ్రీనివాస్‌కు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ వసంత, వైస్‌చైర్మన్, ఎంపీపీ, సర్పంచ్ తౌటి తిరుపతిరెడ్డి, సమతరెడ్డి, ఎంపీటీసీలు, అధికారులు, నాయకులు నరేష్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, నాగరాజు, శ్రీనివాస్‌రెడ్డి, జలందర్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ



ప్రశంసా పత్రాలను చూపుతున్న విద్యార్థులు

కోరుట్ల, జనవరి 6 : పట్టణంలోని శ్రీచైతన్య విద్యార్థులు ఐఎన్‌టీయూఎస్‌వో (ఇండియన్ నేషనల్ టాలెంట్ సర్చ్ ఒలింపియాడ్)లో నిర్వహించిన వివిధ పరీక్షలలో విద్యార్థులు ప్రతిభ కనపరిచినట్లు పాఠశాల ప్రిన్సిపల్ రేణుక శనివారం తెలిపారు. పాఠశాలలో 3వ తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఐఎన్‌టీఎస్‌వో పరీక్షలలో భాగంగా ఏటీఎస్‌వో, ఈటీఎస్‌వో, ఎంటీయస్‌ఓ, జీటీఎస్ఓ, ఎస్‌టీఎస్ పరీక్షలలో పాల్గొన్న 300 మంది విద్యార్థులకు 196 మంది విద్యార్థులు ప్రతిభ కనపరిచి రెండో లెవల్‌కు ఎంపి కైనట్లు ప్రిన్సిపల్ తెలిపారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులను పాఠశాల ప్రి న్సిపల్ రేణుక, డైరెక్టర్ల్ శ్రీవిద్య, శ్రీధర్, ఏజీఎం రాజు, కో ఆర్డినేటర్ల్ కోటేశ్వర్‌రావు, డీన్ రాజా, అనిల్, ఉమారాణీ, ఉపాధ్యాయులు అభినందించారు.

బీఆర్ఎస్‌పై సీబీసీఐడీ విచారణ చేపట్టాలి

బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుప్పాల లింబాద్రి

మెట్‌పల్లి, జనవరి, 6: రాష్ట్రంలో బీఆర్ఎస్ పాలనలో ప్రజాప్రతినిధులు పాల్పడిన అవినీతి, అక్రమ సంపాదించిన ఆస్తులపై సీబీసీఐడీతో విచారణ చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డిని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదిర్శ పుప్పాల లింబాద్రి కోరారు. శనివారం పట్టణంలోని ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో 2014-18 వరకు సంవత్సర కాలంలో పదవిలో ఉన్న బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు నాయకులు అక్రమంగా సంపాదించిన ఆస్తులపై సీబీసీఐడీతో విచారణ చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజలను బెదిరించి వారి భూములను ఆక్రమించుకున్న వారికి శిక్ష విధించాలన్నారు. కార్యక్రమంలో బీమన్న, అమర్, సూరజ్, నవీన్, బద్రీ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు

కోరుట్ల రూరల్, జనవరి 6: గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. శనివారం మండలంలోని అయిలాపూర్ 1 ఎంపీటీసీ బోడ గంగాధర్ తన అనుచరులతో బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరగా జువ్వాడి నర్సింగరావు కండవా కప్పి ఆహ్వానించారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడిన 48 గంటలలో ప్రజలకు ఇచ్చిన హామీ మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని ప్రారంభించిం దని, మరో 5 పథకాలను అమలుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్లిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ చింతకుంట వనిత సంజీవ్ రెడ్డి, నాయకులు కొంత రాజం, నక్క సుధీర్, శశీంధర్ రెడ్డి, పన్నాల అంజిరెడ్డి, గడ్డ సందయ్య, కరపెల్లి అజయ్ రెడ్డి, గోపిడి నారాయణ, ఏలేటి పుల్లారెడ్డి, లింగంపల్లి అంజయ్య, బాద విజయ్, రాజు, గంగాధర్, కన్నె గంగ నర్సయ్య, తమ్మల రాజలింగం పాల్గొన్నారు.

కిష్టంపేటలో న్యాయ విజ్ఞాన సదస్సు

రాయికల్, జనవరి 6: మండలంలోని కిష్టంపేట గ్రామంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జగిత్యాల మొదటి శ్రేణి న్యాయ మూర్తి జితేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయసేవలు, పలు చట్టాలపై అవగాహన కల్పించారు. రాయికల్ ఎస్సై అజయ్, ఏఎస్ఐ దేవేందర్, కోర్టు కానిస్టేబుల్ మహేందర్, బ్లూ కోల్ట్ కానిస్టేబుల్ అశోక్ పాల్గొన్నారు.

ఇంటింటా రాములోరి అక్షింతలు..వాడవాడలా

శోభాయాత్రలు



కోరుట్ల ఝాన్సీరోడ్‌లో శోభాయాత్ర నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు



పెగడపల్లి మండలం నంచర్లలో తలంబ్రాలు అందజేస్తున్న భక్తులు

కోరుట్ల, జనవరి 6 : అయోధ్యలో ప్రత్యేకంగా పూజింపబడిన రాముల వారి అక్షింతలతో పట్టణంలో ఆర్ఎస్ఎస్, విశ్వహిందు పరిషత్, బీజేపీ, బీజేవైఎం, ఏబీవీపీ, హిందు ధార్మిక సంస్థ సభ్యులు శోభాయాత్ర నిర్వహించారు. వివిధ వార్డులలోని దేవాలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ అక్షింతల పంపిణీ కార్యక్రమం నిర్వహించగా మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అక్షింతలను వారికి అందించి రామ మందిరం నుంచి వచ్చిన ఆహ్వానం ప్రతికను చదివి వినిపించి దేవాలయ ప్రతిష్ఠాపనకు రావాలని రాలేనివారు ఆదే సమయంలో ఇంట్లో ప్రత్యేక పూజలను నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్, బీజేపీ, బీజేవైఎం, విశ్వహిందూ పరిషత్ నాయకులు పాల్గొన్నారు.

పెగడపల్లి : మండలంలోని నంచర్ల, ఏడుమో టలపల్లి గ్రామాలలో శనివారం ఇంటింటికి అయోధ్య రామయ్య అక్షింతలు వితరణ కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. అయోధ్య శ్రీరామమందిర ట్రస్టు నుండి వచ్చిన అక్షింతలను డప్పు చప్పుల్లతో మహిళలు మంగళహార తులతో స్వాగతం పలుకగా, రామభక్తులు ఇల్లిల్లూ తిరుగుతూ పంపిణీ చేశారు. కార్యక్రమాలలో ఆయా గ్రామాల సర్పంచులు గోళి మహేందర్‌రెడ్డి, రవి నాయక్, నాయకులు రాములు గౌడ్, లచ్చయ్య, సురేందర్, మల్లేశం, రవీందర్ రెడ్డి, భగత్ రెడ్డి, బక్క నాయక్, తిరుపతినాయక్ పాల్గొన్నారు.

మెట్‌పల్లి: శ్రీ రామ జన్మ భూమి అయోధ్య నందు పూజింపబడిన అక్షింతలతో శనివారం మెట్‌పల్లి పట్టణంలో శోభాయాత్రను నిర్వహించారు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యుల ఆధ్వర్యంలో రాముల వారి అక్షింతలను గోల్ హనుమాన్ ఆలయం వద్ద ప్ర త్యేక పూజలు చేసి రామ సంకీర్తనలు, భజనలతో శోభాయాత్రగా ఇందిరానగర్ 18వ వార్డులోకి శోభయాత్రగా బయలు దేరారు. శోభయాత్రలో మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలుకుతూ ఇంటింటి అక్షింతలను వితరణ చేశారు. కాగా స్థానిక మున్సిపల్ అధ్యక్షురాలు రాణవేని సుజాత శోభాయాత్రలో పాల్గొని అక్షింతలకు ప్రత్యేకపూజలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెట్లపెల్లి మీనా, సుఖేందర్‌గౌడ్, జుంగుల అనిల్‌గౌడ్, ప్రదీప్, నవీన్, మద్దెల నారాయణ, అరిసె రాజేశ్, ఆనంద్, లావణ్య, శ్యామల, సునిత, వైష్ణవి, లతిక, నర్సు, లహరిక, సంగీత, సహస్ర పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్: అయోధ్యలో పూజింపబడిన అక్షింతలు శనివారం మండలంలోని వెల్లుల్లకు చేరుకున్నాయి. రాముల వారి అక్షింతలతో గ్రామంలో హనుమాన్ ఆలయం నుంచి శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి శోభాయాత్రగా బయలు దేరారు. అక్షింతల ను భక్తులు నెత్తిన ఎత్తుకొని రామ నామశరణంతో భజనలు చేసుకుంటూ శోభయాత్రగా శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం వరకు ర్యాలీగా తీసుకొచ్చారు. శోభయాత్రలో మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఆలయంలో అక్షింతలను స్వామి వారి ముందుంచి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. జనవరి 22న అయోధ్యలో శ్రీ సీతా రామ చంద్ర విగ్రహ ప్రతిష్ఠపన మహోత్సవం వైభవంగా జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతి నిధులు, నాయకులు, యూత్ సభ్యులు, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

భీమారం: మండల కేంద్రంతో పాటు మండలంలోని మన్నెగూడెంలో శనివారం అయోధ్య శ్రీరామ మందిరం నుంచి చేరుకున్న అక్షిం తలను మంగళవాయిద్యాలు, డప్పు చప్పుళ్లతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి అక్షింతలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో చెక్కపెల్లి అరుణ, సర్పంచులు సింగిరెడ్డి నరేష్‌రెడ్డి, ఉప సర్పంచ్ సావిత్రిలక్ష్మీపతి, ఎంపీటీసీలు పల్లి అర్జున్, చెన్నమనేని రవీందర్ రావు, అర్చకులు కనపర్తి శ్రీనివాస్, దేవస్థానం చైర్మన్ దాసరి పరంధామ్, సెక్రటరీ జంబైకుంఠ రమేష్ పాల్గొన్నారు.

కొడిమ్యాల: మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో, ఆరు రోజులుగా శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ నుంచి వచ్చిన అయోధ్య రామ అక్షింతలను కరసేవకులు పంపిణీ చేస్తున్నారు. శనివారం మండల కేంద్రంలోని రామాలయంలో,రామకిష్టాపూర్, నల్లగొండ గ్రామాల్లో పండితులు అక్షింతలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం నుంచి ఇంటింటికి తిరుగుతూ అక్షింతలను కరసేవకులు పంపిణీ చేశారు.

గొల్లపల్లి : మండలంలోని శ్రీరాములపల్లె గ్రామంలో శనివారం అయోధ్య శ్రీరామ మందిరం నుంచి చేరుకున్న అక్షింతలను గ్రామస్థులు ఊరేగింపు నిర్వహించారు. ఈ శోభాయాత్రలో పెద్ద ఎత్తున యువకులు, మహిళలు, వివిధ కుల సంఘాల పెద్దలు, గ్రామ ప్రజలు పాలుపంచుకున్నారు. ఆర్ఎస్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు లింగయ్య, మహిళలు పాల్గొన్నారు.

రాయికల్: రాయికల్ మండలంలోని తాట్లవాయిలోని సీతారామచంద్ర స్వామి ఆలయం నుంచి అయోధ్య నుంచి చేరుకున్న అక్షింతలను ఊరేగింపు నిర్వహించారు. సర్పంచ్ మల్లేష్, ఉప సర్పంచ్ నరేష్, వార్డు మెంబర్లు సుజాత, నర్సయ్య పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్ : జగిత్యాల అర్బన్ మండలంలోని ధరూర్ గ్రామంలో గడప, గడపకు అయోధ్యరామయ్య అక్షింతలు కార్యక్రమం శనివారం నిర్వహించారు. శనివారం ఉదయం అయోధ్య శ్రీరామ్ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్‌వారి ఆధ్వర్యంలో అక్షింతలను, కరపత్రాన్ని ధరూర్ గ్రామానికి చెందిన బీజేపీనాయకులు, న్యాయవాది అశోక్ ఇంటివద్ద అతడి కుటుం బ సభ్యులకు అందించారు.



వెల్లుల్లలో అక్షింతలతో శోభయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



మెట్‌పల్లిలో భక్తుల శోభాయాత్ర



భీమారంలో అక్షింతలతో ఊరేగింపు

జిల్లాలో భారీగా ప్రజాపాలన దరఖాస్తులు

జగిత్యాల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలు గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డులలో గత వారం రోజులుగా నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో భారీ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర, జిల్లా ప్రజాపాలన నోడల్ ఆఫీసర్, డీపీవో దేవరాజ్ తెలిపారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రజా పాలన కార్యక్రమ వివరాలను ప్రకటించారు. జిల్లా వ్యాప్తంగా 3,27,218 దరఖాస్తులు వచ్చాయన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్ పొందుపరుస్తున్నామ న్నారు.

కోరుట్ల : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలో ఇచ్చిన హామీల అమలుపై దృష్టి సారించిందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగ రావు అన్నారు. శనివారం పట్టణం లోని పలు వార్డులలో ప్రజాపాలన కేంద్రాలలో స్వీకరిస్తున్న దరఖాస్తు ప్రక్రియను నర్సింగరావు పరిశీలించి దరఖాస్తు దారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిరల్ ఎంబేరీ నాగభూషణం, మాజీ కౌన్సిలర్ల్ సేనాపతి రాజు, రియాజ్, సంగ లింగం నాయకులున్నారు.

●పట్టణంలోని వివిధ వార్డులలో లబ్ధిదారుల ఎంపికకు పట్టణంలోని 33 వార్డుల్లో వార్డు సభలతో పాటు మూడు వార్డులలో ప్రత్యేక కౌంటర్ల ద్వార దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. చివరి రోజు 1,173 దరఖాస్తులు వచ్చినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. 10 రోజుల పాటు నిర్వహించిన దరఖాస్తు స్వీకరణ కార్యక్రమంలో 23,758 దరఖాస్తులు వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్ తెలిపారు.

జగిత్యాల టౌన్: జిల్లా కేంద్రంలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమం శనివారంతో ముగిసింది. చివరి రోజు 43, 44, 45, 46, 47, 48 వార్డుల్లో ప్రజాపాలన కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. ఆయా వార్డుల ప్రత్యేకాధికారులు, కౌన్సిలర్లు, నాయకులు ఉన్నారు.

పెగడపల్లి: అభయహస్తం ఆరు గ్యారంటీల అమలు కోసం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన గ్రామసభలు శనివారంతో ముగిసాయి. చివరి రోజైన శనివారం రాములపల్లి, శాలపల్లి గ్రామాలలో ఎంపీడీవో జె.పుల్లయ్య, తహసీల్దార్ ఎం.ఏ.ఫారూక్, ఎంపీవో మహేందర్ పాల్గొని ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు.

కొడిమ్యాల : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని నిర్వహిస్తున్న ప్రజాపాలన దరఖాస్తులను శనివారం తిర్మాలాపూర్, గంగారాంతండా, నర్సింహులపల్లిలో స్వీకరించారు. ప్రత్యేక అధికారులు ఎంపీడీవో పద్మజారాణి, తహసీల్దార్ రవికాంత్, ఏఈఈ మణిదీప్ ఆధ్వర్యంలో సిబ్బంది స్వీకరించారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న జువ్వాడి నర్సింగరావు

వెల్గటూర్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమానికి ప్రజల నుంచి 18 వేల దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ శేఖర్, ఎంపీడీవో సంజీవ్‌రావు తెలిపారు. శనివారం ఉమ్మడి వెల్గటూర్ మండలంలోని తాళ్లకొత్తపేట, ఉండెడ, సూరారం గ్రామాలలో అధికారులు అభయహస్తం దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంఈవో భూమయ్య, ఎంపీవో శ్రీనివాస్, మండల, గ్రామ స్థాయి అధికారులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

బీర్‌పూర్ : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. అన్ని గ్రామాలలోని ప్రజులు ఆయా పథకాల కోసం చేసుకున్న దరాఖాస్తులను టీమ్ లీడర్లు తహసీల్దార్ రమేష్, ఎంపీవో రామకృష్ణ రాజ్‌ల ఆధ్వర్యంలోని సిబ్బంది స్వీకరించి రసీదులను అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాస్, సర్పంచ్ గుడిసె శ్రీమతి జితేందర్ యాదవ్, ఎంపీటీసీ ఆడెపు మహేశ్వరి తిరుపతి, కార్యదర్శి ఉపేంద్ర, అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

తిరుమల వెంకన్నను దర్శించుకున్న కోరుట్ల ఎమ్మెల్యే

మెట్‌పల్లి, జనవరి, 6 : కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కుటుంబ సభ్యులతో కలిసి తిరుపతి వెంకన్నను దర్శించుకున్నారు. శనివారం తిరుమలలోని వెంకటేశ్వర స్వామిని భార్య దీప్తి, కుమారుడితో కలిసి స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఎన్నికల్లో గెలిపొందిన తర్వాత మొక్కులు చెల్లించుకొవడానికి బయలు వెళ్లినట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గ అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి తాను చేసే కార్యక్రమాలు విజయవంతం కావాలని స్వామిని వేడుకున్నట్లు పేర్కొన్నారు.

మెగా రక్తదాన శిబిరం

మల్యాల, జనవరి 6: మల్యాలలో శనివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. దొంతరవేణి శేఖర్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంను ఎస్సై అశోక్ ప్రారంభించగా వివిధ గ్రామాలకు చెందిన 50 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రి సుపరింటెంట్ ద్వారా జారీ చేసిన బ్లడ్ సర్టిఫికెట్లను మెడికల్ ఆఫీసర్ ఉషారాణి దాతలకు అందజేశారు. కీసరి గణేష్, బొజ్జ నర్సయ్య, నాగుల జగదీష్, అలంకార్, రఘు, చందు పాల్గొన్నారు.

వినోద్‌కుమార్‌పై అసత్య ఆరోపణలు తగదు

కొడిమ్యాల, జనవరి 6 : కరీంనగర్ మాజీ ఎంపీ బోయినిపల్లి వినోద్‌కుమార్‌పై అసత్య ఆరోపణలు తగదని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, సర్పంచుల ఫోరం కొడిమ్యాల మండల అధ్యక్షుడు పునుగోటి కృష్ణారావు శనివారం ఒక ప్రకటనలో అన్నారు. వినోద్‌కుమార్‌కు అన్న లేరని, లేని అన్న కూతురుకు ఉద్యోగం ఎలా ఇప్పిస్తారని అన్నారు. 2001 నుంచి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు జరిగిన ఉద్యమంలో ముందుండి పోరాడిన మంచి వ్యక్తి అని, హైకోర్టు అడ్వకేట్ అన్నారు. వినోద్‌కుమార్‌ను వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో రాజకీయంగా ఎదుర్కోవాలే గాని అసత్య ఆరోపణలతో కాదని పేర్కొన్నారు.

వినియోగదారుల ఆర్థిక ప్రగతికి సహకారం

ధర్మపురి, జనవరి 6: గాయత్రి బ్యాంక్ వినియోగదారుల ఆర్థిక ప్రగతికి సహకారం అందిస్తుందని ఆ బ్యాంక్ ధర్మపురి బ్రాంచ్ మేనేజర్ వొజ్జల మోహన్ తెలిపారు. ధర్మపురి పట్టణానికి చెందిన కటుకం శ్రీనివాస్ అనే గాయత్రి బ్యాంక్ ఖాతాదారుడు గతంలో ప్రమాదవశాత్తు మృతి చెందాడు. గాయత్రి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ధర్మపురి బ్రాంచ్‌లో ఆయన పేరట గాయత్రి నిర్భయ సేవింగ్ ఖాతా ఉంది. ఈ ఖాతాపై ప్రమాద బీమా సౌకర్యం ద్వారా మృతుని భార్య గంగజలకు రూ లక్ష చెక్కును శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మతో కలిసి ఆయన చేతుల మీదుగా అందించారు. అనంతరం మేనేజర్ మోహన్ మాట్లాడుతూ ఖాతాదారులకు కనీస డిపాజిట్‌తోనే ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తుందని అన్నారు. పేద మధ్య తరగతి వినియోగదారులకు ప్రమాద బీమా కల్పిస్తూ వారికి అండగా ఉంటుందన్నారు. ఏటీఎంలో 24 గంటల పాటు నిత్యం నగదు అందుబాటులో ఉంచడం వల్ల ధర్మపురి పరిసర ప్రాంతాల ప్రజలకు నగదు అవసరాలను తీర్చుతుందని పేర్కొన్నారు. ఈ బ్యాంక్ ద్వారా రైతులకు వ్యవసాయ రుణాలు, బంగారు ఆభరణాలపై రుణాలు తక్కువ వడ్డీతో అందిస్తుందని ఆయన తెలిపారు. వినియోగదారులు ఈ సేవలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ఎమ్మెల్యే పరామర్శ

కొడిమ్యాల, జనవరి 6 : మండల కేంద్రానికి చెందిన విక్కుర్తి పర్శరాంగౌడ్ ఇటీవల మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులను శనివారం రాత్రి చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారాయణగౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జీవన్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకుడు ముత్యం శంకర్, పంచాయతీ సభ్యుడు ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజేందర్, చంద్రమోహన్‌రెడ్డి, స్వామి, రవి, వినోద్‌రెడ్డి, నర్సయ్య, లచ్చిరెడి ఉన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

రాయికల్, జనవరి 6: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాయికల్ నగర శాఖ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు రాయికల్ నగర కార్యదర్శి బన్న హరీష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువజనోత్సవాల్లో భాగంగా యువకుల్లో ఉత్సాహం నింపడానికి రాయికల్ పట్టణంలో కబడ్డీ, ఖోఖో, క్రికెట్ పోటీలను నిర్వహించ నున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో పట్టణంలోని వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ ఇన్‌చార్జి ఈశ్వర్ మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

'పేద విద్యార్థులకు అండగా ఉంటా'

ధర్మపురి, జనవరి 6: నిరుపేద విద్యార్థులకు అండగా ఉంటానని ప్రముఖ హృద్రోగ నిపుణులు డాక్టర్ కస్తూరి శ్రీధర్ తెలిపారు. ధర్మపురి మండల కేంద్రంలోని వాటర్ ట్యాంక్ పక్కనే గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రాపర్తి విజయలక్ష్మి విజ్ఞప్తి మేరకు విద్యార్థుల సౌకర్యార్థం పాఠశాలకు రూ 50 వేలు విలువ గల స్మార్ట్ టీవీ, సౌండ్ సిస్టమ్‌లను శనివారం ఆయన బహూకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు ఏ అవసరం ఉన్నా తీర్చుతానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రాపర్తి విజయలక్ష్మి, కాంప్లెక్స్ హెచ్‌ఎం కొలిచాల శ్రీనివాస్, శ్రీధర్ మిత్ర బృందం సభ్యులు రాపర్తి నర్సయ్య, గుండి విష్ణుప్రసాద్, దూస రాజేశ్వర్, జక్కు రవీందర్, పాత బాలకృష్ణ, టీచర్లు స్వప్నప్రియ, భాగ్యలక్ష్మి, శ్రీలత పాల్గొన్నారు.

సాయిబాబా హుండీ లెక్కింపు

కోరుట్ల, జనవరి 6 : పట్టణంలోని సాయిబాబ దేవాలయంలో శనివారం హుండీ లెక్కింపు జిల్లా దేవాదాయ పర్యవేక్షకుడు ఆర్ రవికిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. హుండీ ఆదాయం రూ. 5,37,809 సమకూరినట్లు దేవాలయ కార్యనిర్వహణాధికారి అనూష తెలిపారు. మిశ్రమ వెండి, బంగారం కంసాలి లేకపోడంతో తిరిగి హుండీలో వేసినట్లు దేవాలయ శాఖ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయిబాబ సేవా భక్తులు పాల్గొన్నారు.

డయల్ 100కు వెంటనే స్పందించాలి : ఎస్పీ



ఠాణాలో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ

సారంగాపూర్, జనవరి, 6 : డయల్ 100 కాల్ రాగానే వెంటనే స్పందించి సంఘటన స్థలానికి చేరుకుని సమస్యను పరిష్కరించాలని ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. శనివారం సారంగాపూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ పోలీస్ స్టేషన్ ఆవరణతో పాటు, రిసెప్షన్, లాకప్ రూమ్, రెస్ట్ రూమ్, రికార్డులను పరిశీలించా రు. ఈ సందర్భంగా స్టేషన్‌లో ఎంత మంది విధులు నిర్వహిస్తున్నారు, ఎవరు ఏ విధులు నిర్వహిస్తున్నారు వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో క్రమం తప్పకుండా పెట్రోలింగ్ నిర్వహించాలని దొంగతనాలు జరగ కుండా ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. బ్లూకోట్స్, పెట్రోలింగ్ వాహనం 24 గంటలు గస్తీ నిర్వహించాలని సిబ్బంది కేటాయించిన గ్రామాల సమాచారం పూర్తిగా తమ వద్ద ఉంచుకోవాలన్నారు. ప్రజా ఫిర్యాదులో ఎలాంటి జాప్యం లేకుండా సమస్యలను పరిష్కరించాలని గ్రామాల్లో సీసీ కెమెరాల ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించి గ్రామాల్లో సీసీ కెమోరాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎస్పీ వెంట రూరల్ సీఐ ఆరిఫ్ అలీకాన్, ఎస్సై తిరుపతి ఉన్నారు.

పొన్నం ప్రభాకర్‌ను కలిసిన జిల్లా గౌడ సంఘం నేతలు

జగిత్యాల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌ను జిల్లాకు చెందిన పలువురు గౌడ సంఘం నేతలు కలిశారు. మంగళవారం ఉమ్మడి జిల్లాలోని చిగురుమామిడి కేంద్రంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను జిల్లాకు చెందిన సీనియర్‌గౌడ్ సంఘం నాయకులు, మాజీ సర్పంచ్ పూదరి నర్సాగౌ డ్‌తో పాటు శివలింగు లక్ష్మీ నారాయణ గౌడ్, బుర్ర మహేందర్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. మాజీ సర్పంచ్ పూదరి నర్సాగౌడ్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ శాలువతో సత్కరించారు.

కాంగ్రెస్‌లో చేరిన ఎంపీటీసీలు, కౌన్సిలర్లు

మెట్‌పల్లి రూరల్, జనవరి, 6 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీ పథకాలకు ఆకర్షితులై మెట్‌పల్లి మండ లా నికి చెందిన పలువురు ఎంపీటీసీలతో పాటు పలువురు కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. శనివారం మెట్‌పల్లి జడ్పీటీసీ భర్త కాటిపెల్లి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో మేడిపల్లి ఎంపీటీసీ గుండెల నగేష్, పెద్దాపూర్ ఎంపీటీసీ తేలు కంటి శంకరయ్యలు పార్టీలో చేరగా వారికి కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జీ జువ్వాడి నర్సింగరావు కాంగ్రెస్ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 48 గంటలలోపే ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయడంతో పాటు అభయహస్తం ద్వారా ఐదు గ్యారెంటీల కోసం దరఖాస్తులను సేకరించామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలోని పేద ప్రజలకు అండగా పార్టీ నిలబడుతుందని నాయకులు సేవాభావంతో కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు.

●కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు సమక్షంలో శనివారం మెట్‌పల్లిలోని 15,24,25,26 వార్డులకు చెందిన కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రి ఉమారాణి, మాజీ వైస్ చైర్మన్, కోఆప్షన్ సభ్యులు మార్గం గంగాధర్, మర్రి సహదేవ్, లలిత రాజేష్, లక్ష్మీరాజేశ్వర్‌గౌడ్, సుజాత, నాయకులు మురళి, సురేందర్ చేరారు.